
MB
PUBLICATIONS
ఫిస్ట్ ఆఫ్ షాడో
మధుబాబు

# ఫిష్ ఆఫ్ షాడో

(షాడో స్పై థ్రిల్లర్)

రచన

మధుబాబు

---

*© Author*

*© Madhu Baabu*

*This digital book is published by -*

కినిగె డిజిటల్ టెక్నాలజీస్ ప్రయివేట్ లిమిటెడ్.

సర్వ హక్కులూ రక్షించబడ్డాయి.

*All rights reserved.*

*No part of this publication may be reproduced, stored in a retrieval system or transmitted in any form or by any means electronic, mechanical, photocopying, recording or otherwise, without the prior written permission of the author. Violators risk criminal prosecution, imprisonment and or severe penalties.*

# ఫేస్ ఆఫ్ షాడో

నల్లగా కాటుక పులిమినట్లున్న ఆకాశంలో వేగంగా ప్రయాణం చేస్తోంది ఇంటర్ పోల్‌కి చెందిన ఒక చిన్న జెట్ విమానం. ఉన్నట్లుండి ఏటవాలుగా ముందుకు వంగింది అది. కన్ను మూసి కన్ను తెరిచేటంతలో నేలకు నాలుగువేల అడుగుల ఎత్తుకు దిగిపోయింది.

"గెట్ రెడీ మిస్టర్ షాడో! ఇంకో రెండు నిముషాల్లో టార్గెట్ ఏరియాను సమీపించబోతున్నాం" ఖంగుమంటున్న కంఠంతో ఇంటర్‌కమ్‌లో హెచ్చరించాడు పైలట్.

అరమూసిన కనులతో కునికిపాట్లు పడుతున్నాడు విమానం వెనుక భాగంలో కూర్చుని వున్న షాడో. భుజాలకు తగిలించుకొని వున్న పేరాచూట్ కిట్‌ని సవరించుకుంటూ లేచి నిలబడ్డాడు.

సమత్రా ఐలండ్స్‌కి పశ్చిమ భాగంలో వున్న చిట్టడవుల మీదుగా ఎగురుతోంది విమానం. సరిగ్గా ఒకటిన్నర నిముషాల తరువాత షార్ప్‌గా ప్రక్కకు తిరిగి వెంటనే స్టడీ అయింది.

నిశ్శబ్దంగా ప్రక్కకు జరిగింది షాడో నిలబడిన ప్రదేశానికి నాలుగు అడుగుల దూరంలో వున్న ఎస్కేప్ హేచ్. ఒక్క క్షణం కూడా ఆలస్యం చేయకుండా లోపలికి దూసుకువచ్చింది వళ్ళు గగుర్పొడిచే చలి గాలి.

బయటికి దూకే కార్యక్రమాన్ని వాయిదా వేసుకుని పనామా కాల్చుకుంటూ వెచ్చగా అక్కడే వుండిపోతే బాగుండుననే కోరిక అతని మనసులో అడుగుపెట్టింది.

"మేదాన్ సిటీకి పదిమైళ్ళ దూరంలోకి వచ్చేశాం మిస్టర్ షాడో... నువ్వు వెంటనే ఎజెక్ట్ కాకపోతే మన విమానం మేదాన్ సిటీలోని పోలీస్ టవర్స్‌కి కనిపిస్తుంది. వాళ్ళు ఇన్వెస్టిగేషన్స్ కోసం బయలుదేరితే ఖతం అయిపోతాం మనం..." చిరునవ్వుతో హెచ్చరించాడు ముందు భాగంలో హాయిగా వెచ్చగా కూర్చుని వున్న పైలట్.

పళ్లు బిగపట్టి చలిగాలిని తట్టుకోవటానికి సిద్ధపడ్డాడు షాడో. పేరాచూట్ కిట్‌ని మరోసారి సవరించుకొని ఎస్కేప్ హేచ్‌లోనుంచి బయటికి డైవ్ చేశాడు.

అతని చుట్టూ ఒకసారి రౌండ్ కొట్టింది విమానం. ఎంత వేగంగా వచ్చిందో, అంతకు రెట్టింపు వేగంతో అక్కడి నుంచి వెను తిరిగి వెళ్లిపోయింది.

పారాచూట్‌ని రిలీజ్ చేసి గాలిలో ఉయ్యాలలు వూగుతూ దృష్టిని మరలించాడు షాడో.

నలభై సెకండ్ల తరువాత అతనికి కనిపించాయి నిట్టనిలువుగా ఎదిగివున్న పెద్ద పెద్ద చెట్లు. మరో పది క్షణాల తరువాత, అంత చీకటిలోను కొట్టవచ్చినట్లు అగుపించాయి చెట్ల మధ్య పెరిగివున్న దట్టమైన ముళ్ళపొదలు.

దారితప్పి వాటిలో దూరిపోతే జరుగబోయేదేమిటో ఊహించుకునేసరికి, చీమలు పాకినట్లు కంపరం ఎత్తింది అతని శరీరం. చురకత్తుల వంటి వాటి ముళ్ళను తలుచుకునేసరికి... దాహం వేస్తున్నట్లు ఎండుకుపోయింది గొంతు.

ఇంటర్‌పోల్ డైరెక్టర్లకు ఎదురుచెప్పి, అందరి మాదిరిగానే చక్కగా పబ్లిగ్గా ప్రయాణం చేసి వున్నట్లయితే ఎంతో బాగుండేదని తలపోస్తూ, ముంచుకు రాబోతున్న ప్రమాదాన్ని తప్పించుకోవటానికి విశ్వప్రయత్నం చేసాడు.

ఎంత ప్రయత్నం చేసినా ఏమీ ప్రయోజనం లేకుండా పోయింది. దూరంలో వున్న కొండచరియల మీది నుంచి బయలుదేరిన ఒక గాలి తెర, అతని పేరాచూట్‌ని చుట్టుముట్టి, బలవంతంగా లాక్కుపోయి ముళ్ళపొదల మీదికే విసిరేసింది.

చూస్తుండగానే ఎదురు వచ్చేసింది నేల. వడిశెలలో నుంచి జారిపడిన మట్టిబెడ్డలా దబ్బున శబ్దం చేస్తూ ఒక పొదమీద పడిపోయాడు షాడో. ప్రక్కకు లాగబోతున్న పేరాచూట్‌ని వదిలించుకొని, ఒక్క గంతులో నేలమీదికి దొర్లాడు.

అప్పటికే తన కచ్చనంతా తీర్చుకుంది ముళ్ళపొద. అందిన శరీరభాగానల్లా అంటిపీకి వదిలాయి దాని ముళ్ళు. అంతటితో ఆగకుండా పాంటును పట్టుకుని పీలికలు చేసేశాయి.

పళ్ళ బిగువున ఆ బాధను భరిస్తూ లేచి నిలబడి, పది అడుగులు ముందుకు వేశాడు షాడో. పదకొండో అడుగు వేయబోతుండగా అతని నాశికా రంధ్రాలను సోకిందొక ఘాటయిన వాసన.

నాలుగువేల అడుగుల ఎత్తునుంచి దూకటం వల్ల, కనులు బైర్లు క్రమ్మి, సెన్సేషన్స్ అన్నీ దెబ్బతిన్నాయేమో అన్న అనుమానంతో వున్న చోటునుంచి కదలకుండా చుట్టూ వున్న గాలిని జాగ్రత్త గాటెస్ట్ చేసి చూశాడు.

కనులు బైర్లు క్రమ్మలేదనీ, సెన్సేషన్స్ కొంచెం కూడా దెబ్బతినలేదనీ వెంటనే తెలిసిపోయిందతనికి.

కుడివైపున వున్న చెట్ల మధ్యలో నుంచి వస్తోంది ఆ వాసన. పోలీసులకు తెలియకుండా, దొంగచాటుగా తయారు కాబడే కాపుసారాకు సంబంధించినదది!!

అనవసరంగా ఖంగారు పడిపోయినందుకు తనలో తను నవ్వుకుంటూ మరో పది అడుగులు వేసి బ్రేకులు పడినట్లు చటుక్కున ఆగిపోయాడు ఒక పొద ప్రక్కన.

అక్కడికి కొంచెం దూరంలో కనిపిస్తోంది బ్రహ్మాండమైన అజుగాయ్ వృక్షం ఒకటి. దాని క్రింద నిలబడి వున్నారు పదిమంది దృఢకాయులు. పొడుగాటి ఐరన్ రాడ్స్‌ని పట్టుకొని అతని వంకే చూస్తున్నారు అతి సీరియస్‌గా.

వాళ్ళు ఎవరో, ఎందుకలా మిర్రి మిర్రి చూస్తున్నారో ప్రత్యేకంగా ఒకరు చెప్పాల్సిన అవసరం షాడోకి లేకపోయింది.

"హౌ ఆర్ యూ జంటిల్మెన్? బాగా సాగుతోందా మీ సారాబట్టీ వ్యాపారం? పోలీసుల ఎద్దడి ఏమంత ఎక్కువగా లేదుకదా?" ముఖమంతా నవ్వులమయం చేసుకుంటూ వారిని పలుకరించి, రెండు అడుగులు ప్రక్కకు వేశాడు.

అదే అతను చేసిన పొరపాటు. మాటలు పెదవులు దాటిన తరువాత, కదలకుండా అక్కడే నిలబడినట్లయితే పరిస్థితి ఎలా వుండేదోగాని, పాదాలు ప్రక్కకు తిరిగిన మరుక్షణం కలసికట్టుగా ముందుకు దూకారు వారందరూ.

"వీడెవడో పోలీసుల మనిషే... మన బట్టీలను చూసి పోవటానికి యిలా ఆకాశంలో నుంచి ఊడిపడ్డాడు... కొట్టండి... పళ్లు రాలగొట్టండి" అని అరుస్తూ వచ్చి అతన్ని కమ్ముకున్నారు.

ఎదురుచూడని ఆ డెవలప్‌మెంట్‌ని ఏ విధంగా అర్థం చేసుకోవాలో తెలియక శిలావిగ్రహంలా నిలబడిపోయాడు షాడో, ఒక్కక్షణం పాటు.

ఆ ఒక్క క్షణంలోనే అతని భుజామీద పడ్డాయి అరడజను పిడిగుద్దులు. చేతిలో వున్న ఐరన్ రాడ్‌ని గిరగిరా తిప్పి అతని తొడల మీద బలంగా బాదాడు ఒక దృఢకాయుడు.

అక్కడితో అదిరిపడి దూరంగా పారిపోయింది షాడోని ఆవరించుకొని వున్న ఆశ్చర్యం.

"నేను పోలీసుల మనిషిని కాదు. మీరు మీ సారా బట్టీలు కలిసి సిలెబిస్ సముద్రంలో కలిసినా నాకు అవసరం లేదు. నన్ను వదిలేయండి నాయనలారా... నాజోలికి రాబోకండి" దెబ్బలు తగలకుండా తలకు చేతుల్ని అడ్డం పెట్టుకుంటూ వేడుకున్నాడు.

వారి చెవులకు చేరలేదు ఆ మాటలు.

"కొట్టండి... ఎముకలు విరగగొట్టి ముళ్ళపొదల్లో పారేయండి" అంటూ ఐరన్ రాడ్స్‌ని గాలిలోకి ఎత్తారు అందరూ.

అంతటితో అంతరించి పోయింది షాడో సహనం.

కుడి భుజానికి వ్రేలాడుతున్న ఎయిర్ బేగ్‌ని క్రిందికి వదులుతూ, పిడికిలి బిగించి ముందుకు దూకాడు.

"ఎముకలు విరగగొడతారా? విరగగొట్టి ముళ్ళపొదల్లో పడేస్తారా? ఎలా పడేస్తారో చూపించండి" అంటూ లాగి పెట్టి కొట్టాడు ఒక దృఢకాయుడి ముఖం మీద.

ముక్కు ముఖానికి అతుక్కుపోయి, ముందు పళ్ళు బటానీ గింజల్లా క్రిందికి దొర్లుతుండగా, అజుగాయ్ వృక్షాలు అదిరిపోయేటట్లు అరిచి క్రిందికి వాలిపోయాడు ఆ దృఢకాయుడు.

గిర్రున ప్రక్కకు తిరిగి అడ్డువచ్చిన మరో ఇద్దర్ని మట్టి కరిపించాడు షాడో. క్రిందపడిన ఐరన్ రాడ్స్‌లో ఒకదాన్ని చేజిక్కించుకొని మిగిలినవారి మీదికి లంఘించాడు. వున్న చోట వుండకుండ ఎగిరెగిరి దూకుతూ కొట్టినచోట కొట్టకుండా అందిన వాళ్ళను అందినట్లే విరగదీయటం మొదలుపెట్టాడు.

"కొట్టండి... నరకండి... చంపండి" అని గంతులు వేస్తున్న దృఢకాయుల నోళ్ళు మూతలు పడిపోయాయి ఒక్కసారిగా.

చూస్తుండగానే నేలను కౌగలించుకున్నారు మరో ఇద్దరు.

ఉన్నట్లుండి నాలుగు అడుగులు ముందుకు వేసి, చిందులు తొక్కుతున్న ఒక దృఢకాయుడిని మిగిలిన వారినుంచి వేరుచేశాడు షాడో. చేతి క్రింది నుంచి తిప్పి ఐరన్ రాడ్‌తో అతని తలమీద మోదాడు బలమంతా ఉపయోగించి.

ఫట్ మని శబ్దం చేస్తూ పగిలింది దృఢకాయుడి తల!

"చుట్టుపట్ల వున్న చెట్లతోపాటు, దూరంలో వున్న కొండలు కూడా దద్దరిల్లి పోయేటట్లు గావుకేక పెడుతూ మోకాళ్ళ మీద కూలిపోయాడతను.

అదిచూసి మిగిలినవారి ధైర్యం దిగజారి పోతుందనీ, తోకలు ముడిచి వారందరూ పారిపోతారని ఎదురుచూసిన షాడోకి ఆశాభంగం కలిగింది.

"వెళ్లండిరోయ్... వెళ్లండి. వెళ్లి మనవాళ్ళందర్నీ పిలుచుకు రండిరోయ్" అని అరిచాడు తల పగిలిన దృఢకాయుడు.

అతను అలా హెచ్చరించాల్సిన అవసరం లేకుండానే, అతని గావుకేకను ఆలకించి పరుగు పరుగున అక్కడికి వచ్చేశారు మరో పాతికమంది దృఢకాయులు.

**End of Preview.**

**Rest of the book can be read @**

**http://kinige.com/kbook.php?id=648**

* * *

**Read other books of Mr. Madhubabu @**

**http://kinige.com/kbrowse.php?via=author&id=20**